క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పలువురు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి అంకిరెడ్డిపల్లి సర్పంచ్

కొండపాక(గజ్వేల్): మండలంలోని అంకిరెడ్డిపల్లి సర్పంచ్ దంపతులు బడేకోలు లావణ్య నర్సింలు బుధవారం గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా సర్పంచ్ వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో ఉద్యమ కాలం నుంచి పని చేస్తూ పలు పదవులను అనుభవించిన తమకు పార్టీలో సరైన గుర్తింపు లేదని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..



బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు ఉంటాయని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అమలవుతాయని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష, మండల ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తున్కిబొల్లారంలో బుధవారం నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు స్వరూపరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ఎల్లక్షన్‌రెడ్డి, అశోక్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

సిద్దిపేటజోన్/నంగునూరు: ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ మాటలు నమ్మవద్దని, ఒక్కసారి కాంగ్రెస్‌ను గెలిపించాలని సిద్దిపేట కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని 30, 32, 33, 42, 43 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, యాదగిరి, అత్తు, నర్సింహారెడ్డి, కలిమ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నంగునూరు మండలంలోని వెంకటాపూర్, అంక్షాపూర్, ఖానాపూర్, తిమ్మాయిపల్లి, నాగరాజుపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, దేవులపల్లి యాదగిరి, ఎనగందుల యాదగిరి,రంగు అశోక్ గౌడ్, కనకయ్య, , నాగరాజు, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మద్దతుగా తీర్మానాలు



హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలను అందిస్తున్న బీడీ కార్మికులు

సిద్దిపేటజోన్/చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో బీఆర్‌ఎస్ ఇంటింటికి ప్రచారం చేపట్టింది. ఈసందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు ఆయా కుల, స్వచ్ఛంద సంస్థలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి మద్దతు ప్రకటిస్తున్నారు. ఆర్యవైశ్య సంఘం, గాడిచర్లపల్లిలో అంబేద్కర్ సంఘం, ఇందిరమ్మ కాలనీలో విశ్వకర్మ సంఘం, బీడీ కార్మికులు పెద్ద ఎత్తున ఏకగ్రీవ తీర్మానం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు విఠోభ, శ్రీనివాస్ యాదవ్, మోహిజ్, రఘురాం, సుందర్, బుచ్చిరెడ్డి, సురేష్, మల్లికార్జున్, సులోచన, లక్ష్మణ్, యోగి, నాయకులు నవీన్, శివ, తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని విఠలాపూర్, చంద్లాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో ఎంపీపీ మాణిక్యరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. మెట్‌పల్లిలో పలు కుల సంఘాలు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి.

జోరుగా నాయకుల ప్రచారం



పోతిరెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



మర్మాములలో ప్రచారం నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్

కొమురవెల్లి(సిద్దిపేట)/చేర్యాల/మద్దూరు(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి నీలిమ మండలంలోని అయినాపూర్, రసులాబాద్, కొమురవెల్లిలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, సర్పంచ్ సార్లలత, సౌజన్య, గీస బాలమణి, తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఇంటింటి ప్రచారం

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆపార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మర్మాములలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, సర్పంచ్ సుందరగిరి స్రవంతి, బీఆర్‌ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు మంద సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు



అలిరాజ్‌పేటలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రతిపక్షాల మాటల నమ్మొద్దని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంతాయిగూడ, మందాపూర్, పలుగుగడ్డ, కొండాపూర్, దౌలాపూర్, గొల్లపల్లి, అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషం గౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మోసపోతే గోస పడతాం

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ నాయకుల మాటలకు ఆశపడితే గోస పడతామని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, మంగోల్ గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, నాయకులు కనకయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

కోహెడరూరల్(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుడా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి సీఐ కిరణ్ సూచించారు. బుధవారం మండలంలోని గుండారెడ్డిపల్లి, బస్వాపూర్, పోరెడ్డిపల్లి, ఆరెపల్లిలో కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొమురవెల్లి మండలంలోని మర్రిముచ్చాలతో పాటు మద్దూరు మండలంలోని సలాక్‌పూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి, మద్దూర్ ఎస్ఐలు నాగరాజు, యూసుఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా



పడమటికేశ్వాపూర్‌లో మాట్లాడుతున్న కొమ్మూరి



బచ్చన్నపేట: మహిళలతో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- గెలవగానే ఆరు గ్యారంటీల అమలు
- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

బచ్చన్నపేట: ప్రజలకు అందుబాటులో ఉంటూ జనగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆలింపూర్, పడమటికేశ్వాపూర్, పోచన్నపేట, నారాయణపురం, బచ్చన్నపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, భోనాలు, కోలాటాతో ప్రతాప్‌రెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు. వైఎస్సార్ హయాంలో రిజర్వాయర్లను నిర్మించి దేవాదుల కెనాల్ ద్వారా జలాలను తీసుకురావడంతో ఈ ప్రాంతం సస్యశ్యామమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలను గెలిచిన తర్వాత అమలుచేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని, అన్నదాతలకు ఇంత వరకు పంట రుణాలు మాఫీ చేయలేదని విమర్శించారు. ఈ ప్రాంత సమస్యలు తెలియని నాయకులు వస్తున్నారని, వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..

మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో నాయకులు జంగిటి విద్యానాథ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో 200 మంది చేరారు. అలాగే చేర్యాల మండల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, లెనిన్‌నగర్ సర్పంచ్ సనాది సబితభాస్కర్, ఐనాపూర్ సర్పంచ్ చెరుకు రాంరెడ్డిలతో పాటు సీపీఎం పార్టీ నుంచి 100 మంది కొన్నె గ్రామంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కొమ్మూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మసూద్, ఆరుగొండ పర్శరాములు, జ్యోతి భాస్కర్, నిమ్మ శ్రావణ్‌రెడ్డి, జంగిటి నరేష్, విజయ్‌కాంత్, సంతోష్‌రెడ్డి, భాస్కర్, వినయ్, బాలకిషన్, రమేష్, వెంకట్‌రెడ్డి, బాలమణి, విజయలక్ష్మి, మంజుల, వేణువందన రామాచిరి, కిష్టయ్య పాల్గొన్నారు.

కొమ్మూరిని భారీ మెజార్టీతో గెలిపించాలి

జనగామ రూరల్: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని పెంబర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జనగామలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

జనగామ: పట్టణంలో 18, 19, 21వ వార్డుల పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. గడప గడపకు తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, కంచ రాములు, ఆకుల లక్ష్మయ్య, మోటీ శ్రీనివాస్, బండారు శ్రీనివాస్, దోర్నాల వెంకటేశ్వర్లు, మంగ సత్యం, బోరెల్లి సిద్దులు, ఏల జనార్దన్, గందమల్ల కమలాకర్, పాముకుంట్ల మణిదీప్ పాల్గొన్నారు. కాగా, సీపీఎం పార్టీకి చెందిన పలువురు నాయకులు, చేర్యాల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, ఐనాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, లెనిన్ నగర్ సర్పంచ్ సనాది సబితా భాస్కర్ కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు.

కొమ్మూరి గెలుపునకు కృషి

చేర్యాల(సిద్దిపేట): గడిచిన 10 ఏళ్లలో ఈప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ అన్నారు. పట్టణకేంద్రంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాసంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం నెలకొన్న పరిణామాల దృష్ట్యా జనగామ ప్రాంతం స్థానికేతరుల చేతిల్లోకి వెళ్లి పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి, ఔనత్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే మాతృ పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరానన్నారు. జనగామ కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, నాయకులు కొమ్మూరి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సీపీఎం సర్పంచ్‌లు..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని లెనిన్‌నగర్, అయినాపూర్ సీపీఎం సర్పంచ్‌లు సనాది సబిత భాస్కర్, చెరుకు రమణారెడ్డి, చేర్యాల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి బుధవారం బచ్చన్నపేటలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ప్రతాప్‌రెడ్డిని అసెంబ్లీకి పంపాలి

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై మాట్లాడే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎమ్మెల్యే గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆయన కోడలు కొమ్మూరి నాగప్రియాంకరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొడవటూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా సిద్దేశ్వరాలయంలో పూజలు చేసి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు మల్లం శ్రీనివాస్, నిమ్మ కరుణాకర్‌రెడ్డి, పాకాల చిరంజీవి, రాసూరి రామయ్య, జయ, కవిత పలువురు పాల్గొన్నారు.



అలింపూర్ ప్రచారంలో కొమ్మూరి



పెంబర్తిలో కాంగ్రెస్ నాయకులతో ప్రశాంత్‌రెడ్డి

హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపిద్దాం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/నంగునూరు: బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపిద్దామని 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాలలక్ష్మి ఆనంద్ అన్నారు. బుధవారం పట్టణంలోని 37వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జక్కుల రాజు, నాయకులు బత్తుల శ్రీనివాస్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. అలాగే నంగునూరు మండలంలోని నర్మెట, అప్పలాయిచెర్వు గ్రామాల్లో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, నాయకులు సారయ్య, సోమిరెడ్డి, అజీద్, బాబు, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

సిద్దిపేటకమాన్: యువకుడు అదృశ్యమైన సంఘటనపై సిద్దిపేట టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాజిద్‌పూరకు చెందిన ఎండీ జావెద్‌కు ఐదుగురు కుమారులు. మంగళవారం కుటుంబ సభ్యులు అందరూ కలిసి భోజనం చేసి ఇంట్లో నిద్రించిన అనంతరం చిన్న కుమారుడు ఎండీ హమీద్ (19) చనిపోతున్నాను అంటూ లెటర్ రాసి బయటకు వెళ్లిపోయాడు. ఉదయం బంధువులు, స్నేహితులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో హమీద్ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన శిక్షణ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా ఎలక్షన్ పీఓ, ఏపీఓ, సిబ్బందికి ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసిందని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని 304 పోలింగ్‌స్టేషన్లకు 754 మంది ఉద్యోగులకు పీఓ, ఏపీఓ విధుల బాధ్యతలను అప్పగించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్



హుస్నాబాద్: నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్: నియోజకవర్గంలో పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రూ. వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు. అధికారంలోకి రాగానే ప్రాజెక్టును ప్రారంభించి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట: మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

గౌడన్న మద్దతు సతీశ్‌కుమార్‌కే..

అక్కన్నపేట(హుస్నాబాద్): నియోజకవర్గంలోని గౌడ కులస్తులంతా బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ వెంట ఉంటారని గౌడసంఘం హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మగాని శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మగాని రాజేశం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కులం పేరుతో రాజకీయాలు చేసే నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎంపీగా ఉన్నప్పుడు గౌడ కులస్తులను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర మహిళా విభాగం చైర్మన్ పూదరి రాజేశ్వరి, నాయకులు అనురాధ, కుమారస్వామి, పర్శరాములు, శ్రీనివాస్, శ్యాం సుందర్‌గౌడ్, తాళ్లపెల్లి మల్లేశం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జనగామ బిడ్డను గెలిపించే బాధ్యత మీదే



జనగామ: పార్టీలో చేరిన నాయకులను స్వాగతిస్తున్న దశమంతరెడ్డి



జనగామ: పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి

- అనుక్షణం అందుబాటులో ఉంటా
- బీజేపీ జనగామ అభ్యర్థి దశమంతరెడ్డి

జనగామ: జనగామ బిడ్డను.. స్థానికుడైన తనను గెలిపించుకునే బాధ్యత ఈ ప్రాంత ప్రజలపై ఉందని బీజేపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. పట్టణంలోని 26, 27, 28 వార్డుల్లో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం దశమంతరెడ్డి మాట్లాడుతూ ఆశీర్వదిస్తే, జనగామను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసానికి, ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఉద్యమ నేతగా చెప్పుకునే కేసీఆర్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత, కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వక పోగా, పాత వాటిలో పిల్లల పేర్లు నమోదు చేసే అవకాశం కల్పించలేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ పదేళ్ల కాలంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ సైతం తుంగలో తొక్కారని ఆరోపించారు. పేదల సొంతిటి కల సాకారం చేయకపోగా, అదిగో ఇదిగో అంటూ నేటికి మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ ప్రజలు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే, అభివృద్ధి, అవినీతి రహిత పరిపాలన ఎట్లా ఉంటుందో చూపిస్తానని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమం బాగుంటుందని, ఓటర్లు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపించేలా ఇక్కడ ఇండస్ట్రియల్ రంగాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. కాగా, ఆయా పార్టీల నుంచి బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి స్వాగతించారు. సొడ రమేష్, పవన్‌శర్మ, సంపత్, శానబోయిన మహిపాల్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో పథకాలు అమలు

జనగామ రూరల్: కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని శామీర్‌పేట, పెంబర్తి, సిద్దెంకి, ఎల్లంల, గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, బండారు తిరుపతి, శివరాజ్, కోంతం శ్రీనివాస్, మహిపాల్ పాల్గొన్నారు.